సాక్షి తిరుపతి

సోమవారం । 15 । జనవరి । 2024

I



వైభవంగా భోగి తేరు

శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో కృష్ణస్వామి, ఆండాళ్ అమ్మవారు భోగి తేరుపై మాడవీధుల్లో ఊరేగారు. - IIలో



దూసుకెళ్లిన కోడెగిత్తలు

రామచంద్రాపురం మండలం అనుప్పల్లెలో ఆదివారం జోరుగా ఎడ్ల పందేలు నిర్వహించారు. - IIలో



వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు..

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు యువకులు మృతి చెందారు. - IIలో

న్యూస్‌రీల్

సంతోషం వెల్లివిరిసేలా సంక్రాంతి


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


డిప్యూటీ సీఎం నారాయణస్వామి


మంత్రి ఆర్‌కే రోజా

తిరుపతి అర్బన్ : సుఖసంతోషాలు వెల్లివిరిసేలా ప్రజలు సంక్రాంతి పండుగ జరుపుకోవాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు అధికారులు ఆకాంక్షించారు. భగవంతుని ఆశీస్సులతో జిల్లావాసులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు. ఈ మేరకు సుహృద్భావ వాతావరణంలో సంక్రాంతి, కనుమ పండుగలు జరుపుకోవాలని సూచించారు.

స్టేట్ బెస్ట్ వలంటీర్‌గా జోత్స్న


అవార్డు అందుకుంటున్న జోత్స్న

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్‌కు చెందిన వలంటీర్ ఎల్.జోత్స్న స్టేట్ బెస్ట్ వలంటీర్‌గా ఎంపికైంది. శనివారం ఈ మేరకు విజయవాడలో అవార్డు అందుకుంది. మహిళా వర్సిటీలో ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ ఫైనలియర్ చదువుతున్న జోత్స్న 2019 నుంచి వలంటీర్‌గా విస్తృత సేవలు అందిస్తోంది. 2021లో ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్, 2022లో రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌కు ఎంపికై ంది. అలాగే 2023లో జాతీయ యువజనోత్సవంలో ఉత్తమ ప్రతిభ కనబరచడం విశేషం. అవార్డు గ్రహీతను ఉన్నత విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ వెంకటపతిరావు, ఎన్ఎస్ఎస్ అధికారి అశోక్‌రెడ్డి అభినందించారు.

రేపు ఎస్వీ గోశాలలో కనుమ పూజలు

తిరుపతి(అలిపిరి) : కనుమ పండుగను పురస్కరించుకుని మంగళవారం తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో గోపూజ నిర్వహించనున్నట్లు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. ఉదయం 6 గంటలకు వేణుగానం , 8 గంటలకు వేదపారాయణం, కోలాటం, భక్తి సంకీర్తనల ఆలాపన ఉంటాయన్నారు. అనంతరం 10.30 గంటలకు శ్రీవేణుగోపాల స్వామివారి సన్నిధిలో గోపూజతోపాటు హారతి, తులసి పూజ, గొబ్బెమ్మ వేడుక, గజ పూజ, అశ్వ పూజ, వృషభ పూజ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గోవులకు బెల్లం, బియ్యం, పశుగ్రాసం తినిపించే భాగ్యాన్ని భక్తులకు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

రేపటి వరకు ముక్కంటి ఆలయంలో అభిషేకాలు రద్దు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు అభిషేకాలు రద్దు చేసినట్లు ఆలయాధికారులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ 15న సంక్రాంతి, 16న కనుమ పండుగ, గిరిప్రదక్షిణ సందర్భంగా అభిషేక సేవలను రద్దు చేసినట్లు వివరించారు. భక్తులు గమనించాలని కోరారు.


ఎంబీయూలో భోగి మంట వేస్తున్న మోహన్‌బాబు


రద్దీగా తిరుపతిలోని వీవీ మహల్ రోడ్డు



భోగి మంటల వెలుగుల్లో మంచు దుప్పటి తొలగిపోయింది. వెచ్చటి అనుభూతిని ఆస్వాదిస్తూ ప్రజల హృదయం పరవశించింది. రంగవల్లుల తోరణాలతో ఊరూ వాడా మెరిసిపోయింది.. బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరిసింది. హరిదాసు కీర్తనలు.. డూడూ బసవన్నలతో సందడి కనువిందు చేసింది.. కమ్మని పిండి వంటల సువాసనలు.. పతంగులు ఎగురవేసే యువకులు.. నూతన వస్త్రాలు ధరించిన పిల్లల సంతోషాలు.. సంబరాల సంక్రాంతికి మరింత సొబగులు తీసుకువచ్చింది.

తిరుపతి ఎమ్మార్‌పల్లె సర్కిల్ వద్ద భోగి మంట వేస్తున్న యువకులు

భోగి వెలుగులు..
సంక్రాంతి సొబగులు

- సంతోషంగా పండుగ సంబరాలు
- వేకువజాము నుంచే మొదలైన వేడుకలు
- నేడు మకర సంక్రాంతికి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- కనుమ రోజున గోపూజకు సన్నాహాలు

తిరుపతి సిటీ : నగరాలు.. పట్టణాలు.. పల్లె ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి జిల్లావ్యాప్తంగా భోగి మంటలు వెలుగులు విరజిమ్మాయి. ప్రజలు ఉత్సాహంగా భోగి పండుగ జరుపుకున్నారు. మహిళలు అద్భుతంగా రంగవల్లులతో వీధులను అలంకరించారు. పిల్లలు, పెద్దలు కొత్త దుస్తులు ధరించి ఆనందించారు. యువత పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరపడ్డారు.

కిక్కిరిసిన తిరునగరం

జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలతో రెండు రోజులుగా తిరుపతి కిక్కిరిపోయింది. ముఖ్యంగా గాంధీరోడ్డు, చిన్నబజారు వీధి, నేతాజీరోడ్డు, కేటీ రోడ్డు, ఎయిర్‌బైపాస్ రోడ్డు, లీలామహల్ సర్కిల్, ఇందిరా ప్రియదర్శినీ మార్కెట్, ఆర్‌సీ రోడ్డులోని షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు, పూల అంగళ్లు జనసంద్రంగా మారాయి. సాంప్రదాయ వంటకాలను ప్రత్యేకంగా తయారు చేస్తున్న స్వీట్ షాపుల వద్ద ప్రజలు బారులుతీరారు., ఎలక్ట్రానిక్ షాపుల ప్రకటించిన సంక్రాంతి ఆఫర్లతో నగరంలోని ప్రతి షోరూమ్ సందడిగా మారింది. నగరంలోని ప్రధాన కూడళ్లు రద్దీగా మారాయి. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రయాణికులతో నిండిపోయాయి. ఈ క్రమంలోనే సోమవారం సంప్రదాయబద్ధంగా సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు జిల్లావాసులు ఏర్పాట్లు చేసుకున్నారు. కనుమ పండుగ నాడు గోపూజ చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. అలాగే పలు ఆలయాల్లో సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


సత్యవేడు : ఇంటింటి వాకిటా భోగి మంట


తిరుచానూరు రోడ్డులో ముగ్గు వేస్తున్న మహిళలు


సత్యవేడు : బసవన్న సందడి

కమనీయం.. గోదాదేవి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

తిరుపతి కల్చరల్: తిరుపతి కేటీ రోడ్డులోని శ్రీవరదరాజస్వామి ఆలయంలో ఆదివారం కమనీయంగా గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహించారు. ధనుర్మాసం చివరిరోజు భోగి పండుగను పురస్కరించుకుని స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి, శ్రీరంగనాథ స్వామి వారిని సర్వాంగసుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలోని మండపానికి వేంచేపు చేశారు. చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెంచలకోనలో..


తిరుచ్చిపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

రాపూరు : పెంచలకోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహస్వామి, గోదాదేవి కల్యాణం నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ మాడవీధుల్లో కనులపండువగా క్షేత్రోత్సవం చేపట్టారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు.

అలరించిన కవి సమ్మేళనం


సమ్మేళనానికి హాజరైన కవులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. దూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి అధ్యక్షతన సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత ప్రిన్సిపల్ లగడపాటి కిరణ్మయి మాట్లాడుతూ పలు అంశాలను వివరిస్తూ దూరదృష్టితో ఆలోచించే కవులు, రచయితలు సమాజ దార్శనికులను కొనియాడారు. తన తండ్రి లగడపాటి భాస్కర్ రచనలు చిరస్మరణీయమని, ఆయన లేని లోటు పూడ్చలేమని తెలిపారు. అందుకే భాస్కర్ పేరుతో ఇద్దరు సాహితీవేత్తలకు పురస్కారం అందిస్తామని వెల్లడించారు. అనంతరం సంక్రాంతి విశిష్టత, సాంస్కృతిక విలువలు, తెలుగు భాష వైభవంపై పలువురు కవులు తమ కవితలు వినిపించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రబాబు, వేదిక కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, గురునాథం గణేష్, బాలముని శివకుమార్, పెళ్లకూరు సుబ్బారెడ్డి, కళాకారులు పిళ్లారి బత్తినయ్య, సున్నపు లక్ష్మయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిలకిలలు..కళకళలు!





నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో వలస విహంగాలు సందడి చేస్తున్నాయి. గూడబాతులు.. నత్తగుల్ల కొంగలు.. తెడ్డుముక్కు కొంగలు.. తెల్లకంకణాయిలు.. స్వాతి కొంగలు.. నీటి కాకులు కనువిందు చేస్తున్నాయి. చెరువు వద్ద చెట్లపై గూళ్లు కట్టుకుని గుడ్లు పెట్టి పొదుగుతున్నాయి. పక్షుల కిలకిలరావాలతో పరిసర ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. వీక్షణకు విచ్చేసిన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. - దొరవారిసత్రం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 65,962 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,962 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.78 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

'ఎన్ఐసీ'కి మహిళా వర్సిటీ విద్యార్థినులు


విద్యార్థినులను అభినందిస్తున్న వీసీ భారతి తదితరులు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని ఎన్ఎస్ఎస్ యూనిట్లకు చెందిన విద్యార్థులు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఎన్ఐసీ (నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపు)కి ఎంపికయ్యారు. యూనిట్–3 నుంచి సుష్మిత, యూనిట్–14 నుంచి యాస్మిన్, యూనిట్–16 నుంచి సాయి రక్షిత పాల్గొననున్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించనున్నట్లు నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఎన్ఎస్ఎస్ యూనిట్–1 తనుజ, యూనిట్–8 సుష్మిత, యూనిట్–11 నుంచి చంద్రకళ, యూనిట్–16 నుంచి ప్రవల్లిక ఎంపికైనట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను వీసీ భారతి, రిజిస్ట్రార్ రజిని, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ విద్యావతి, ప్రోగ్రామ్ అధికారులు అనిత, వజీహా, పద్మావతి, నీరజ, శిరీష, స్వాతి అభినందించారు.

అండర్‌-14 క్రికెట్‌ రాష్ట్ర జట్టుకు హర్షవర్ధన్‌రెడ్డి


హర్షవర్ధన్‌రెడ్డి

తిరుపతి రూరల్‌: అండర్‌–14 విభాగంలో రాష్ట్ర క్రికెట్‌ జట్టుకు ముచ్చెలి హర్షవర్ధన్‌రెడ్డి ఎంపికయ్యాడు. తిరుపతి రూరల్‌ మండలం చిగురువాడకు చెందిన ముచ్చెలి ధరణీకుమార్‌రెడ్డి, పుష్ప దంపతుల కుమారుడైన హర్షవర్ధన్‌రెడ్డి స్థానిక అకార్డ్‌ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రికెట్‌ అకాడమీలో కోచ్‌ వాసుదేవరెడ్డి పర్యవేక్షణలో హర్షవర్ధన్‌రెడ్డి ఏడేళ్లుగా శిక్షణ పొందుతున్నాడు. జిల్లా, జోనల్‌, సౌత్‌జోన్‌ పోటీల్లో విశేషంగా రాణించాడు. ఈనేపథ్యంలో ఆదివారం నిర్వహించిన సెలక్షన్స్‌లో ఓపెనింగ్‌ బ్యాట్స్‌మెన్‌గా ఎంపికయ్యాడు. హర్షవర్ధన్‌రెడ్డి, కోచ్‌ వాసుదేవరెడ్డిని తుడా చైర్మన్‌ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, క్రికెట్‌ జిల్లా జట్టు కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, అకార్డ్‌ స్కూల్‌ చైర్మన్‌ చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్‌ ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

19న అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణ

- ఎస్సీ కమిషన్‌ చైర్మన్‌ వెల్లడి


మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్‌ చైర్మన్‌ మారుముడి విక్టర్‌ ప్రసాద్‌

తిరుపతి అర్బన్‌: విజయవాడలో ఈనెల 19న సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అంబేడ్కర్‌ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు రాష్ట్ర ఎస్సీ కమిషన్‌ చైర్మన్‌ మారుముడి విక్టర్‌ ప్రసాద్‌ తెలిపారు. ఆదివారం ఆయన ఎస్సీ సంఘం నేతలతో కలసి తిరుపతి ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మీడియాతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పి మాట తప్పిందని గుర్తుచేశారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రూ.2 వేల కోట్ల విలువ చేసే 20 ఎకరాల్లో రూ.400 కోట్లతో 125 అడుగుల బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చిన్న విషయం కాదన్నారు. ఆయన వెంట ఎస్సీ వెల్ఫేర్‌ జిల్లా అధికారి చెన్నైయ్య ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు యువకుల దుర్మరణం

- పండుగ నాడు పలు కుటుంబాల్లో విషాదం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వేకువజామున వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు యువకులు మృత్యువాత పడ్డారు. భోగి పండుగ నాడు జరిగిన ఈ ఘటనలలో మృతుల కుటుంబీకులు విషాదంలో మునిగిపోయారు.

దొరవారిసత్రం : మండలంలోని కలగుంట సమీపంలో ఉన్న ఫ్లైఓవర్‌పై గుర్తుతెలియని వాహనాన్ని ద్విచక్రవాహన వెనకనుంచి ఢీకొనడంతో ముగ్గురు యువకులు మృతి చెందారు. వివరాలు.. నాయుడుపేటకు చెందిన కోగిలి రాంకీ(24), తన స్నేహితుడు మునిరత్నం (24)తో కలిసి బైక్‌పై శనివారం రాత్రి ఏకొల్లు గ్రామానికి వెళ్లాడు. అక్కడ కన్నలి గౌతమ్‌(25)ను కలిసి సరదాగా కాలక్షేపం చేశారు. అనంతరం ముగ్గురూ బైక్‌పై నాయుడుపేటకు తిరిగి వస్తూ ముందు వెళ్లే వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రాంకీ, గౌతమ్‌ అక్కడికక్కడే మరణించగా, మునిరత్నం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. సీఐ జగన్‌మోహన్‌రావు, ఎస్‌ఐ తిరుమలరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు.


గౌతమ్‌, రాంకీ , మునిరత్నం (ఫైల్‌)

శోకసంద్రంలో కుటుంబీకులు

నాయుడుపేట మండలం అత్తలపాళెం గ్రామానికి చెందిన మునిరామయ్య, రేణుకమ్మ కుమారుడు మునిరత్నం. తండ్రి ఇది వరకే అనారోగ్యంతో మరణించాడు. ప్రస్తుతం మునిరత్నం తల్లికి మతిస్థిమితం లేదు. దీంతో మూడేళ్లుగా పట్టణంలో బార్బర్‌ షాప్‌ పెట్టుకుని తల్లిని పోషించుకుంటున్నాడు. ఇప్పుడు మునిరత్నం ప్రాణాలు కోల్పోవడంతో అతడి తల్లి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇదే మండలంలోని జీలపాటు గ్రామానికి చెందిన కోగిలి చిన్న రమణయ్య, హైమావతి దంపతులకు ఏకైక సంతానం రాంకీ. ఇటీవలే స్థానిక విక్కీ కంపెనీలో పని చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోవాదోడుగా ఉంటున్నాడు. ఇప్పుడు కుమారుడు కన్ను మూయడంతో ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరమూ కావడం లేదు. డీవీ సత్రం మండలం ఏకొల్లు ఎస్సీ కాలనీకి చెందిన కన్నలి రమణమ్మ, కృష్ణయ్య కుమారుడు గౌతమ్‌. ఈయువకుడు అపాచీ కంపెనీలో పని చేస్తూ తల్లిదండ్రులకు అండగా నిలిచాడు. విధి చిన్నచూపు చూడడంతో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నిండిపోయింది.


మృతుల కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎన్‌డీసీసీబీ చైర్మన్‌ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

బాధిత కుటుంబాలకు పరామర్శ

పెళ్లకూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు యువకులు కుటుంబాలను నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌ చైర్మన్‌ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పరామర్శించారు. నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి చేరుకుని ఓదార్చారు. పోస్టుమార్టం ముగిసే వరకు ఆస్పత్రి వద్దే ఉండి బాధిత కుటుంబాలకు కావాల్సిన కనీస అవసరాలను పర్యవేక్షించారు. ప్రమాద ఘటనను ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట జీలపాటూరు సర్పంచ్‌ కందమూడి శివకుమార్‌ ఉన్నారు.

టిప్పర్‌ ఢీకొని..

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని వేణుగోపాలపురం వద్ద టిప్పర్‌ ఢీకొని నరేష్‌ (23) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు.. వరదయ్యపాళెం మండలం కాంబాకం గ్రామానికి చెందిన అప్పారావు కుమారుడు నరేష్‌ వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత శ్రీకాళహస్తికి కేటీ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా తడ నుంచి వస్తున్న టిప్పర్‌ వేగంగా ఢీకొంది. దీంతో నరేష్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నరేష్‌ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొని..


విజయ్‌ (ఫైల్‌)

చంద్రగిరి : పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారిపై తొండవాడ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. అగరాలకు చెందిన విజయ్‌(25) ద్విచక్ర వాహనంపై శానంబట్ల నుంచి స్వగ్రామానికి వస్తుండగా అదుపు తప్పి విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొన్నాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్‌ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే పోలీసుల తనిఖీలు


రైలులో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రవి

రేణిగుంట : రేణిగుంట రైల్వే జంక్షన్‌లో జీఆర్‌పీ పోలీసులు ఆదివారం సాయంత్రం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ షేక్‌ షాను ఆదేశాల మేరకు ఎస్‌ఐ రవి, సిబ్బందితో కలసి స్టేషన్‌లోని వెయిటింగ్‌ హాళ్లు, పలు రైళ్లలోని కోచ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంజాయి, మద్యం తదితరాలను తరలిస్తున్నారా అనే కోణంలో అనుమానితుల బ్యాగులను సైతం నిశితంగా పరిశీలించారు.

చెరువులో పడి యువకుడి మృతి

కేవీబీపురం : మండలంలోని దిగువ పుత్తూరులో ఆదివారం ఓ యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన వి.ఆర్ముగం (25) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తన పశువులను మేతకు తోలుకెళ్లాడు. పశువులు రామయ్య చెరువులోకి దిగడంతో వాటిని గట్టుకు చేర్చేక్రమంలో ఆర్ముగం చెరువులో పడి మునిగిపోయాడు. కుటుంబీకులు గాలించగా చెరువులో ఆర్ముగం మృతదేహం కనిపించింది. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందలేదు.

ఎంబీయూలో సంక్రాంతి సంబరాలు



ఎంబీయూ వద్ద భోగి మంట వేస్తున్న మంచు విష్ణు తదితరులు, మోహన్‌బాబుతో మాట్లాడుతున్న తుడా చైర్మన్‌ చెవిరెడ్డి మోహిత్‌ రెడ్డి

- పాల్గొన్న మంచు కుటుంబ సభ్యులు

చంద్రగిరి: తెలుగువారి సంక్రాంతి పర్వాదినాన్ని ప్రజలందరూ ఆనందంతో పండుగ చేసుకోవాలని ఎంబీయూ ఛాన్సలర్‌, సినీ నటుడు మంచు మోహన్‌బాబు ఆకాంక్షించారు. ఆదివారం శ్రీసాయినాథ్‌ నగర్‌లోని ఎంబీయూలో కుటుంబ సభ్యులతో కలసి సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున యూనివర్సిటీ ముందు భోగిమంటలు వేశారు. మంచు విష్ణు, నటుడు శివ బాలాజీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ సూర్యుడు మకరరాశిలోకి వచ్చే క్రమంలో అన్నదాత పండించిన తొలిపంట ఇంటికి రావడం జరుగుతుందన్నారు. ఆ పంటతో వండిన అన్నాన్ని భగవంతుడికి సమర్పించి, రైతన్నల సంక్రాంతి పండుగను జరుపుకోవడం, పెద్దలను స్మరించుకోవడం, గోమాతలను పూజించుకోవడం తరతరాలుగా వస్తున్న సనాతన ధర్మమని తెలిపారు. తెలుగువారికి పెద్ద పండుగగా చెప్పుకునే సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. మంచు విష్ణు నటిస్తున్న భక్త కన్నప్ప సినిమా సుమారు రూ.150కోట్ల వ్యయంతో నిర్మించడం జరుగుతోందని, సినిమా పూర్తి చేసేందుకు సమయం మొత్తం కేటాయించినట్లు మోహన్‌బాబు తెలిపారు. ఎవరూ ఊహించని రీతిలో భక్తకన్నప్ప ప్రేక్షకులను ఆదరిస్తుందని తెలిపారు.

మోహన్‌బాబు కుటుంబ సభ్యులను కలిసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

సినీనటుడు మోహన్‌ బాబు, ఆయన కుమారుడు విష్ణులకు తుడా చైర్మన్‌ చెవిరెడ్డి మోహిత్‌ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా శ్రీవిద్యానికేతన్‌లోని మోహన్‌బాబు ఇంటికి వెళ్లి ఆయన వారిని శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత వారి ఆశీస్సులు తీసుకున్నారు. కొత్త ఏడాది మోహిత్‌రెడ్డికి అంతా మంచే జరగాలని ఆకాంక్షించారు.

గర్భిణి మృతిపై కేసు

వాకాడు : మండలంలోని వల్లమేడుకు చెందిన రౌతు లిఖిత(19) అనే గర్భిణి ఆదివారం మృతి చెందడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నాయుడుపేట కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన లిఖితకు వల్లమేడుకు చెందిన రౌతు మురళీతో ఏడాది క్రితం వివాహమైంది. ప్రస్తుతం ఆమె 7 నెలల గర్భిణి. హఠాత్తుగా కడుపు నొప్పితోపాటు కాళ్లు చేతులు లాగుతుండడంతో కుటుంబ సభ్యులు నాయుడుపేటలోని ఒక ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించేలోపే ఆమె మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లిఖిత బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పవన్‌కుమార్‌ తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్పీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1998–2001లో బీఎస్సీ కంప్యూటర్‌ విద్య అభ్యసించిన విద్యార్థులు దాదాపు 23 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ప్రస్తుతం వారు వివిధ హోదాల్లో ఉన్నారు. ఆర్‌డీఓ స్థాయిలో ఉన్నవారు, విదేశాల్లో సెటిల్‌ అయిన వారు కూడా ఉన్నారు. రెండు దశాబ్దాల అనంతరం కలిసిన మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కళాశాల అభివృద్ధికి అందించాల్సిన చేయూతపై చర్చించుకున్నారు. తమ వంతు సాయం చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

'డబుల్‌ డెక్కర్‌'లో లైవ్‌ ట్రాకింగ్‌



తిరుపతి కల్చరల్‌ : తిరుపతిలో తొలిసారిగా అందుబాటులోకి వచ్చిన డబుల్‌ డెక్కర్‌ బస్సు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు డిప్యూటీ మేయర్‌ భూమన అభినయ రెడ్డి చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆయన ఆదేశాలతో బస్సులో లైవ్‌ ట్రాకింగ్‌ సిస్టమ్‌ ఏర్పాటు చేశారు. దీంతో బస్సు ఏ ప్రాంతంలో ఉంది, ఎంత దూరంలో ఉంది, ఎంత సమయంలో రానుంది వంటి వివరాలను ప్రయాణికులు సులువుగా తెలుసుకోవచ్చు. ప్రజలందరూ httt://tinyur .com/52-kch7jt లింక్‌ ద్వారా లైవ్‌ ట్రాకింగ్‌ సిస్టమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులు కోరుతున్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్‌

ఏర్పేడు : ఇనుప రాడ్లు చోరీ చేసిన కేసులో ఆదివారం ఇద్దరిని అరెస్ట్‌ చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. వాహనాల తనిఖీలలో భాగంగా వెంకటగిరి రోడ్డు కూడలిలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రూ.35వేల విలువైన 120 ఇనుప రాడ్లు పట్టుబడ్డాయన్నారు. చిందేపల్లె సమీపంలోని జగనన్న కాలనీ నుంచి వాటిని అపహరించినట్లు గుర్తించామని వెల్లడించారు. ఈ మేరకు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

దూసుకెళ్లిన కోడెగిత్తలు



రామచంద్రాపురం: రామచంద్రాపురం మండలం అనుప్పల్లెలో ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని జల్లికట్టు నిర్వహించారు. పెద్దసంఖ్యలో జనం గ్రామానికి చేరుకుని ఎద్దల పందేలను వీక్షించారు. దూసుకెళుతున్న కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు ముందుకు ఉరికారు. పలకలు చేజిక్కించుకునేందుకు పోటీ పడ్డారు. గాయాలను సైతం లెక్కచేయకుండా లక్ష్యం సాధించేందుకు ఉత్సాహంగా పరుగులు తీశారు.

ఇద్దరు చైన్‌ స్నాచర్ల అరెస్ట్‌


వివరాలు వెల్లడిస్తున్న రూరల్‌ సీఐ వేణుగోపాల్‌రెడ్డి

గూడూరురూరల్‌ : పలు ప్రాంతాల్లో చైన్‌ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్‌ చేసి, వారి నుంచి రూ.9లక్షల విలువైన బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు రూరల్‌ సీఐ జి.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఆయన విలేకర్లకు వివరాలు వెల్లడించారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నాయుడుపేట మండలం పుదూరుకు చెందిన చిట్టేటి అనిల్‌కుమార్‌, పూడేరుకు చెందిన సంక్రాంతి శ్రీనివాసులు అనుమానాస్పదంగా కనిపించారన్నారు. వారిని తనిఖీ చేయగా 17 సవర్ల బంగారు నగలు పట్టుబడ్డాయని వెల్లడించారు. విచారణలో చైన్‌స్నాచర్లుగా తేలిందని చెప్పారు. నగలతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్ట్‌ చేసిన రూరల్‌ ఎస్‌ఐ మనోజ్‌కుమార్‌, హెడ్‌కానిస్టేబుల్‌ ఆర్‌వీ రాజు, విష్ణు, సురేష్‌,శ్రీనులను సీఐ అభినందించి రివార్డు అందజేశారు.

అవార్డు గ్రహీతకు అభినందన


అవార్డు అందుకుంటున్న శరవణన్‌

వరదయ్యపాళెం : శ్రీసిటీలోని వెంచర్‌ ఆటోమోటివ్‌ పోలింగ్‌ ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ పరిశ్రమ సీఈఓ శరవణన్‌ జానకిరామన్‌కు ప్రతిష్టాత్మక యూరోపియన్‌ బిజినెస్‌ సమ్మిట్‌ ఇంటర్నేషనల్‌ అచీవర్‌ అవార్డు లభించింది. ఇటీవల లండన్‌లో నిర్వహించిన బిజినెస్‌ సమ్మిట్‌లో శరవణన్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శరవణన్‌ జానకిరామన్‌ను శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.

వైభవంగా భోగి తేరు


మాడ వీధుల్లో ఊరేగుతున్న దేవదేవేరులు

తిరుపతి కల్చరల్‌ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఆదివారం వైభవంగా భోగి తేరు నిర్వహించారు. ఆండాళ్‌ అమ్మవారు, శ్రీకృష్ణస్వామి వారిని భోగి తేరుపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. సోమవారం మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఉదయం ఆలయంలో దేవదేవేరులకు తిరుమంజనం నిర్వహించనున్నారు. కపిలతీర్థంలోని శ్రీఆళ్వార్‌ తీర్థంలో చక్రస్నానం చేపట్టనున్నారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. భోగి తేరు కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్‌, టెంపుల్‌ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనుంజయ పాల్గొన్నారు.